సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 30 । ఆగస్టు । 2025



ఉన్నత ప్రమాణాలతో ఏర్పాటు
ఉన్నత ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. - 8లో



ఉప్పొంగిన మూసీ
మూసీకి వరద పోటెత్తింది.దీంతో జూలూరు - రుద్రవెల్లి మధ్య లోలెవల్ వంతెన పైనుంచి రాకపోకలు నిలిచిపోయాయి. - 9లో



తెలుగు భాషా దినోత్సవం
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. - 9లో

న్యూస్‌రీల్

15న ఎంజీయూ స్నాతకోత్సవం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవాన్ని సెప్టెంబర్ 15న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథులుగా ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరవుతారని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు 57 బంగారు పతకాలు, 22 మందికి పీహెచ్‌డీ పట్టాలు అందించనున్నామని వెల్లడించారు. అంతకుముందు బోధన, బోధనేతర సిబ్బందికి విధులు, బాధ్యతలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఈఓ ఉపేందర్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ ఏఈఓగా పదోన్నతి



నాగుల మహేష్‌కు పదోన్నతి ఉత్తర్వు పత్రం అందజేస్తున్న శైలజారామయ్యర్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పర్యవేక్షకుడు నాగుల మహేష్‌కు ఏఈఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రెవెన్యూ, దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం ఆయనకు ఉత్తర్వులు అందజేశారు.మహేష్ గత సంవత్సరం బదిలీల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వరి స్వామి ఆలయం నుంచి యాదగిరి క్షేత్రానికి వచ్చారు. ఆలయ పర్యవేక్షకుడిగా పని చేస్తున్న ఆయనకు ఏఈఓగా పదోన్నతి రావడంపై ఆలయ ఉద్యోగులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట్రావ్, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

భువనగిరిటౌన్: సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం ఉద్యోగస్తుల పాలిట శాపంగా మారిందన్నారు. 1వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఎదుట వెయ్యి మంది ఉద్యోగులతో నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ ప్రసాద్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు భగత్, ఉద్యోగ సంఘాల నాయకులు మహమ్మద్ కదీర్, అమరేందర్‌రెడ్డి, యాదయ్య, లక్ష్మీ నరసింహారెడ్డి, బోయ రాములు, శ్రీకాంత్, శ్రీనివాస్, నర్సింహ, గణగాని శశికాంత్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కత్తుల కుమార్, శ్రీనివాస్, బాలేశ్వర్, అరుణ, బాలరాజు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

భువనగిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలను శుక్రవారం డీఈఓ సత్యనారాయణ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలని సూచించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, నిర్ణీత సమయం ప్రకారం విద్యార్థులకు స్లిప్ టెస్టులు, ఎఫ్‌ఏ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం నరసింహులు, ఉపాధ్యాయులు యాదమ్మ, రేణుక, రజిత, వీరారెడ్డి, పీడీ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో నిర్వహించిన రన్‌లో పాల్గొన్న అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు

జాతీయ క్రీడా దినోత్సవం

భువనగిరి: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం భువనగిరిలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు రన్ నిర్వహించారు.ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సాహితి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో ఫస్ట్

ఆగస్టు మాసానికి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం

- వివిధ దశల్లో 7,730 గృహాలు
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.44 కోట్లు జమ
- ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారుల నిరంతర పర్యవేక్షణ
- లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సాహం



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

సాక్షి, యాదాద్రి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆగస్టు మాసానికి రాష్ట్రస్థాయిలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు విడతల్లో 9,495 ఇళ్లు మంజూరు కాగా.. 7,730 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. ఇందులో బేస్మెంట్ లెవల్ 4,951, రూఫ్ లెవల్ 833, స్లాబ్ లెవల్ 226 ఇళ్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.44.94 కోట్లు జమ చేశారు.

కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ

కలెక్టర్ హనుమంతరావు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, క్షేత్ర సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు సహకరించడంతో పాటు సమీక్షలు, క్షేత్ర పర్యటనలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

నియోజకవర్గాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి

	భువనగిరి	ఆలేరు	తుంగతుర్తి	మునుగోడు	నకిరేకల్
మంజూరు	3,280	3,639	573	1,314	689
ప్రారంభం కానివి	628	662	91	239	145
మార్కౌట్ ఇచ్చినవి	2,652	2,977	482	1,075	544
బేస్మెంట్ లెవల్	1,673	1,974	338	752	214
లెంటల్	257	352	68	125	26
స్లాబ్..	65	91	30	21	19
పూర్తయినవి	01	06	01	01	01

ఎమ్మెల్యేల ప్రోత్సాహం

ఎమ్మెల్యేలు స్వయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దివ్యాంగులు, వితంతువుల ఇళ్ల నిర్మాణాలకు 50 బస్తాల సిమెంట్ ఉచితంగా ఇస్తున్నారు. అదే విధంగా గృహప్రవేశం సమయంలో యజమానులకు మేకపోతు, ఇంటిల్లిపాదికి నూతన వస్త్రాలు అందజేసి ప్రోత్సహిస్తున్నారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి గృహప్రవేశం చేసే వారికి నూతన వస్త్రాలు అందజేస్తున్నారు.

లబ్ధిదారులకు రుణాలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్న లబ్ధిదారులకు ఆర్థికంగా సహకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్ల పరిశీలనకు వెళ్లగా పలువురు లబ్ధిదారులు తమ సమస్యలు తెలియజేస్తున్నారు. అటువంటి వారికి స్వయం సహాయక మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.14 కోట్ల రుణాలు ఇప్పించారు.

నేత్రపర్వంగా స్వాతినక్షత్ర పూజలు



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వాతినక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున వైకుంఠద్వారం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. శ్రీస్వామి వారి పాదాల వద్ద, వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మెట్ల మార్గంలో వెళ్లి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఇక ఆలయ ముఖమండపంలో స్వాతిహోమం ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు. ఆ తరువాత పంచామృతాలు, శుద్ధ జలాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపిన బంగారు, వెండి కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలకారమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు.



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరీశుడి ఆస్తుల లెక్క తేల్చండి

- శైలజారామయ్యర్

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామివారి ఆస్తుల లెక్క తేల్చాలని రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి యాదగిరిగుట్ట పట్టణం, పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, దబగుంటపల్లి, మరికొన్ని చోట్ల వందల ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) సర్వే ద్వారా భూములన్నింటినీ గుర్తించి హద్దులు నిర్ణయించాలని స్పష్టం చేశారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల భూములను డీజీపీఎస్ సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. కాగా యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియా భూములు సుమారు 1,500 ఎకరాలకు సంబంధించిన వివరాలను ఆలయ అధికారులు శైలజారామయ్యర్‌కు అందజేశారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఓ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామా.. సాకారం

- హైకోర్టు తీర్పుతో తొలగిన అడ్డంకులు
- 22,450 దరఖాస్తులకు మోక్షం
- క్రమబద్ధీకరణతో భూ హక్కులు వర్తింపు



సాక్షి,యాదాద్రి: సాదాబైనామాలకు మోక్షం కలగనుంది. లిఖితపూర్వక ఒప్పందంతో కొనుగోలు చేసిన భూములకు సంబంధించి రికార్డులు లేకపోవడం, పట్టాదారులుగా గుర్తించలేని పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు సాదా బైనామాల పరిష్కారంపై విధివిధానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను ఈనెల 26న కొట్టివేసింది. 2014 జూన్ 2కు ముందు రైతుల అధీనంలో ఉన్న భూములను ఆధారాల ప్రకారం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది.

మండలం	దరఖాస్తులు	భువనగిరి	1641
బీబీనగర్	881	బొమ్మలరామారం	1231
మోటకొండూరు	915	గుండాల	2218
రామన్నపేట	1519	యాదగిరిగుట	604
వలిగొండ	1987	నారాయణపురం	1352
ఆత్మకూర్	460	రాజపేట	1355
తుర్కపల్లి	859	చౌటుప్పల్	1043
మోత్కూరు	1318	అడ్డగూడూరు	2905
పోచంపలి	943	ఆలేరు	1194

ఆర్‌ఓఆర్‌లో పట్టాలు

గతంలో భూముల కొనుగోలు సాదా కాగితాలపై జరిగింది. కొనుగోలు చేసిన రైతులకు భూములు అమ్మిన రైతులు కబ్జా ఇచ్చారు. కానీ, పట్టా మార్పిడి కాలేదు. ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం సాదా కాగితాల మీద కొనుగోలు చేసిన భూములకు పట్టా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాదాబైనామాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కాగా సాదాబైనామాలో కొనుగోలు చేసిన భూములకు చట్టబద్ధత కల్పించి పాస్ పుస్తకాలు జారీ చేయాలని గత ప్రభుత్వం 2020 నవంబర్ వరకు దరఖాస్తులు స్వీకరించింది. అయితే ధరణి పోర్టల్‌లో సాదాబైనామాల రిజిస్ట్రేషన్ కాలమ్ విస్మరించింది. దీంతో కాగితాల మీద కొనుగోలు చేసిన భూములకు ధరణిలో పేర్లు రాలేదు. అమ్మిన రైతుల పేర్లే మళ్లీ వచ్చాయి. దీంతో ధరణి వివాదాలకు కేంద్రమైంది.

వీటికి పరిష్కారం లభిస్తుందా..

నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ సాదాబైనామా కోసం వచ్చిన పలు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. భూ భారతి చట్టం ప్రకారం వీటికి పరిష్కారం లభిస్తుందా.. అని ఎదురు చూస్తున్నారు. ఈ రకంగా వాటిలో కొన్ని సాదాబైనామాలకు నోటీస్ ఇచ్చారు. కొన్ని దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. ప్రభుత్వ భూముల నుంచి దరఖాస్తులు వచ్చాయి. సాదా కాగితాల మీద అమ్మిన రైతులు ప్రభుత్వ రికార్డుల్లో లేరు. కొన్ని రికార్డుల్లో సర్వే నంబర్లు వేయలేదు. ఒకటి అంతకంటే ఎక్కువ సార్లు అమ్మకం, గతంలోనే పట్టా సర్టిఫికెట్ జారీ చేయడం, కొన్నిచోట్ల ఇళ్ల స్థలాలు ఉండటం, ఐదు ఎకరాలపైన భూమి ఉండడం, కోర్టు కేసులు, రక్త సంబంధికులకే అమ్మడం వంటివి దరఖాస్తులు వచ్చాయి.

కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు

గత ప్రభుత్వంలో, తాజాగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 22,425 దరఖాస్తులు వచ్చాయి. హెచ్‌ఎండీఏ మండలాలతో పాటు మున్సిపాలిటీల్లోని విలీన గ్రామాల్లో కూడా సాదాబైనామాలకు అవకాశం ఇవ్వడం జరిగింది. 2020 అక్టోబర్ నుంచి 2020 నవంబర్ 10 వరకు తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకం చట్టం–1971 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి క్రమబద్ధీకరించుకోవచ్చని కోర్టు తెలిపింది.

'భూ భారతి'ప్రకారం ముందుకెళ్తాం



సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు అందలేదు. భూ భారతి చట్టం ప్రకారం ముందుకెళ్తాం. చిన్న,సన్నకారు రైతులకు మేలు జరుగుతుంది.

–జి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్

పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలి



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు, డీఈఓ సత్యనారాయణ


- కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్: పాఠశాలల అభివృద్ధికి గ్రామపెద్దలు చేయూతనివ్వాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు కొమ్ము నాగరాజు రూ.1,40,000తో డ్యూయల్ డెస్క్ బెంచీలు, అమర్నాథ్‌రెడ్డి లక్ష రూపాయలతో క్రీడా దుస్తులు బహూకరించగా వాటిని డీఈఓ సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. అందులో భాగంగానే ఆంగ్ల విద్య, నాణ్యతతో కూడిన భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. అనంతరం దాతలను అభినందించారు. అలాగే టెన్త్‌లో ఉత్తమ ర్యాంకుల సాధించిన గవ్వల రక్షిత, నమిలె శ్రీనిధికి మాజీ సర్పంచ్ కానుగు కవిత బాలరాజ్‌గౌడ్, డాక్టర్ అమరేందర్ నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శరత్‌యామిని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకూ పదోన్నతులు ఇవ్వండి

పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల్లో అర్హత కల్పించాలంటున్న బీఈడీ ఎస్‌జీటీలు

- ప్రస్తుత ప్రమోషన్లలో చోటుకోసం డిమాండ్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇటీవల లేఖ
- జిల్లాలో 1,086 మంది ఎస్‌జీటీలు.. వీరిలో 528 మంది బీఈడీ చేసినవారే



భువనగిరి: బీఈడీ అర్హత ఉన్న ఎస్‌జీటీలు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టుల్లో తమకూ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అర్హత, అనుభవం కలిగి, బీఈడీ పూర్తి చేసిన తమను ప్రస్తుతం చేపట్టిన పదోన్నతుల్లో పరిగణలోకి తీసుకోకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఈడీ కలిగి ఎస్‌జీటీలు పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం కొంతకాలంగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. జీఓ 11,12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీలకు సైతం పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి లేఖ అందజేశారు.

గతంలోనే నియామకం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 సంవత్సరం వరకు నిర్వహించిన డీఎస్సీల్లో ఇంటర్, డీఈడీ పూర్తిచేసిన వారితో పాటు డిగ్రీ, బీఈడీ ఉన్న అభ్యర్థులు కూడా ఎస్‌జీటీలుగా నియమింపబడ్డారు. తర్వాత కాలంలో డీఈడీ చేసిన వారిని మాత్రమే ఎస్‌జీటీ పోస్టులకు అర్హులని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తర్వాత కాలంలో డీఈడీ చేసిన వారిని మాత్రమే ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పరిగణించారు. దీంతో బీఈడీ అర్హతతో ఎస్‌జీటీలుగా నియామకమైనా ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పదోన్నతికి తిరస్కరణకు గురవుతున్నారు. 2015, 2024 సంవత్సరాలతో పాటు తాజాగా ఈ నెలలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఆయా సంవత్సరాల్లో బీఈడీ ఉన్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండిత్‌లకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించలేదు.

జీఓ నంబర్లు 11,12 సవరణకు డిమాండ్

జీఓ నంబర్ 11,12ను సవరించి పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు డీఈడీ టీచర్లతో పాటు బీఈడీ చేసిన ఎస్‌జీటీలను కూడా అర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ జీఓల వల్ల అర్హత ఉన్నా పదోన్నతుల అవకాశాలను కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు.

బీఈడీ చేసిన ఎస్‌జీటీలు ఇలా..

జిల్లాలో 715 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి, ఇందులో 484 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 163 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 1,086 ఎస్‌జీటీలు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం 528 మంది బీఈడీ చేసిన ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో సీనియార్టీ ఉన్నవారంతా పీఎస్ హెచ్‌ఎం పదోన్నతుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

27 ఏళ్లుగా పదోన్నతి లేదు



బీఈడీ అర్హతతో ఎస్‌జీటీగా నియామకం పొందాను. అర్హతలున్నా 27 ఏళ్లుగా ఎలాంటి పదోన్నతి లేకుండా విధులు నిర్వహిస్తున్న. బీఈడీ అర్హత కలిగిన వారికి పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే విషయాన్ని తిరస్కరించడం సరియైనది కాదు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాన్ని కోరాం.

–గిరిధర్‌రెడ్డి, ఎస్‌జీటీ, బొమ్మలరామారం

న్యాయం చేయాలి



బీఈడీ అర్హత కలిగి ఎస్‌జీటీలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు లాగ్వేంజ్ పండిత్‌గా, ఇటు పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతి లేకుండా రిటైర్డ్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం తమ సమస్యపై ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి బీఈడీ కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

–వనం వెంకటేశ్వర్లు, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు

బోటులో ప్రయాణించి.. సూచనలిచ్చి

- భువనగిరి, రాయగిరి చెరువులను పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు



రాయగిరి చెరువులో బోటుపై ప్రయాణిస్తూ పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ

భువనగిరి, బీబీనగర్: గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని రాచకొండ సీపీ సుధీర్‌బాబు శుక్రవారం భువనగిరి పెద్దచెరువు, రాయగిరి చెరువును సందర్శించారు. రాయగిరి చెరువులో బోట్‌పై ప్రయాణించి పరిశీలించారు. నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. చెరువుల్లో నీరు ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బీబీనగర్ పెద్ద చెరువును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నందున నిర్వాహకులు గణేష్ విగ్రహాలను బీబీనగర్‌కు తరలించే అవకాశం ఉందన్నారు. చెరువు జాతీయ రహదారి పక్కన ఉన్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీస్‌లకు సూచించారు. ఆయన వెంట డీసీపీ అక్షాంశ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు రాహుల్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్, సీఐలు ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ రమేష్ ఉన్నారు.



యూరియా తిప్పలు

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి శుక్రవారం రైతులు యూరియా కోసం తరలివచ్చారు. గంటల తరబడి లైన్‌లో నిల్చున్నారు. స్టాక్ లేకపోవడం, రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ సీఈఓ జహేందర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉన్నత ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న ఎంజీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఉన్నత ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులు మరింత రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి గుర్తింపు తేవాలని విజేతలకు సూచించారు. అనంతరం స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసిన క్యాలెండర్, పోస్టర్లను వీసీ విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, హరీష్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, మురళి, శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ శివశంకర్ పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మర గాలింపు


పాలేరు వాగులో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు బృందాలు

అనంతగిరి: గోండ్రియాల వద్ద పాలేరు వాగులో గురువారం గల్లంతైన కిన్నెర ఉపేందర్ మృతదేహం కోసం శుక్రవారం తెల్లవారుజాము నుంచి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గోండ్రియాల నుంచి కొత్తగూడెం చెక్‌డ్యాం వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు పోలీసు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. వాగులో భారీ రాళ్లు ఉన్న కారణంగా రెస్క్యూ టీం పడవలు వెళ్లలేక కొంత ఇబ్బందులు రావడంతో స్థానిక గజ ఈతగాళ్ల సహకారంతో గాలిస్తున్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం, అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్, కోదాడ ఫైర్ ఆఫీసర్ ముత్తినేని శ్రీనివాస్, తహసీల్దార్ హిమబిందు, ఆర్ఐ వెంకట నగేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మెరుగైన సౌకర్యాలపై దృష్టి


స్వామి వారి క్షేత్ర మహత్యాన్ని తెలిపే బొమ్మల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శైలజా రామయ్యర్, కలెక్టర్, ఈఓ

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- యాదాద్రి ఆలయాభివృద్ధి, టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియా ఫైనలైజేషన్‌పై సమీక్ష

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దృష్టి కేంద్రీకరించామని దేవాదాయ, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. శుక్రవారం యాదగిరి కొండపైన గల అతిథి గృహంలో వైటీడీఏ సీఈఓ, వీసీ కిషన్‌రావు, ఈఓ వెంకట్రావ్, కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పనులు, టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియా ఫైనలైజేషన్‌కు సంబంధించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి వారి క్షేత్ర మహత్యానికి సంబంధించిన బొమ్మల పుస్తకాన్ని, మాడ వీధిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను ప్రారంభించారు. గరుడ ట్రస్టుకు సంబంధించిన ప్రాథమిక విధివిధానాల్లో భాగంగా ఏర్పాటు చేసిన లిస్టును సైతం తెలిపారు. రూ.50వేలకు పైనా విరాళం గరుడ ట్రస్టుకు ఇస్తే రూ.300 టికెట్‌పై సంవత్సరంలో ఆరుగురు చొప్పున 2 పర్యాయాలు బ్రేక్ దర్శనం, రూ.150 టికెట్‌పై ఆరుగురు చొప్పున 2 పర్యాయాలు బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌కు ఈఓ తెలిపారు. అంతే కాకుండా రూ.లక్షకు పైగా గరుడ ట్రస్ట్‌కు చెల్లిస్తే బ్రేక్ దర్శనం రూ.300 టిక్కెట్‌పై ఆరుగురు చొప్పున 4 పర్యాయాలు, రూ.150 బ్రేక్ దర్శనంపై ఆరుగురు 4 పర్యాయాలు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇక రూ.2లక్షలపైన చెల్లిస్తే రూ.300 బ్రేక్ దర్శనంపై ఆరుగురు చొప్పున 8 పర్యాయాలు, కొండ కింద గల యాదరుషి నిలయంలో డబుల్ బెడ్ రూంను కేటాయించనున్నట్లు వివరించారు. తరువాత దేవస్థానం పరిధిలోని గోశాల, లక్ష్మీ పుష్కరిణితో పాటు, వేద పాఠశాల నిర్మాణం పనులను పరిశీలించారు. అంతకు ముందు శ్రీస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి, దేవాదాయశాఖ ఉప కమిషనర్లు వినోద్‌రెడ్డి, కృష్ణ ప్రసాద్, వెంకటేష్, తహసీల్దార్ గణేష్ నాయక్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి పాల్గొన్నారు.

'దివీస్'తో కుమ్మక్కై అలైన్‌మెంట్ మార్చారు


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపణ
- రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులతో సమావేశం

చౌటుప్పల్ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దివీస్ పరిశ్రమతో కుమ్మక్కై రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి దూరంగా వెళ్లాల్సిన ట్రిపుల్ ఆర్‌ను నాటి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కలిసి మున్సిపాలిటీలోకి తీసుకువచ్చారని ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రైతులు, నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరతరాలుగా భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు న్యాయం చేయాలని, భూమికి భూమి లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారంగా పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అలైన్‌మెంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా మార్చి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. రైతులకు, నిర్వాసితులకు అన్యాయం చేసిన వ్యక్తులే ఇప్పుడు వారిని రెచ్చగొడుతూ ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసగాళ్లు ఎవరో, మోసం చేసినవారు ఎవరో, మొసలి కన్నీరు కారుస్తున్నవారెవరో తనకు పూర్తిగా తెలుసన్నారు. ఏ ఒక్క శాతం అవకాశం ఉన్నా అలైన్‌మెంట్‌ను మార్పిస్తానని, లేనిపక్షంలో అధిక మొత్తంలో పరిహారాన్ని ఇప్పించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో స్వయంగా మాట్లాడి సమస్యపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆర్డీవోకు శేఖర్‌రెడ్డిని ఫోన్‌లో అడిగారు. రైతులు అంగీకరిస్తే పరిహారం వారి అకౌంట్‌లలో జమ అవుతాయని ఆర్డీవో చెప్పారు. పరిహారం విషయం తేలనందున ప్రస్తుతం అన్ని రకాల ప్రక్రియలను ఆపాలని ఆర్డీవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ట్రిపుల్‌ఆర్ సమస్య తనతో పరిష్కారం కాకుంటే.. దేవుడితో కూడా అవ్వదన్నారు. కొందరి మాటలు నమ్మి తనపై అపోహలకు పోవద్దని, తాను ప్రజలందరికీ ఎమ్మెల్యేనన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా తాను భరించలేనన్నారు. సమస్యను పరిష్కరించే బాధ్యత తనదేనని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పబ్బు రాజుగౌడ్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, వెల్లి రాజశేఖర్ రెడ్డి, సుర్వి నర్సింహ, మొగుదాల రమేష్, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.హన్నుభాయ్, బొంగు జంగయ్య, నిర్వాసితులు రాములు, ప్రకాష్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, జాల శ్రీశైలం, నాగెల్లి దశరథ, జాల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- తను నిద్రించే స్థలంలో వేరే వ్యక్తి వచ్చి నిద్రపోవడంతో తలెత్తిన వివాదం
- దుర్భాషలాడాడన్న కోపంతో రాయితో కొట్టి హత్య


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాల వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురికాగా.. ఈ కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన షేక్ సిరాజ్ అనే వ్యక్తి హుస్సేన్ దగ్గర లారీ క్లీనర్‌గా పని చేసేవాడు. నెల క్రితం లారీలో లోడ్‌తో నల్లగొండ నుంచి వెళ్తున్న క్రమంలో హుస్సేన్‌తో షేక్ సిరాజ్ గొడవ పడ్డాడు. దీంతో సిరాజ్‌ను డ్రైవర్ లారీ నుంచి దింపేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సిరాజ్ నల్లగొండ పట్టణంలో ఉంటూ అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద రూ.5 భోజనం చేస్తూ చుట్టుపక్కల భిక్షమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సమయంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాల వద్ద నిద్రపోయేవాడు.

దూషించాడన్న కక్షతో..

15 సంవత్సరాల క్రితం నల్లగొండకు వలస వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమేష్ (40) మద్యం మత్తులో ఈనెల 27న రాత్రి సమయంలో సిరాజ్ పడుకునే స్థలం వద్దకు వచ్చాడు. సిరాజ్ నిద్రపోయేందుకు వేసుకున్న పట్టాలో రమేష్ నిద్రించాడు. ఇక్కడ ఎందుకు నిద్రిస్తున్నావని సిరాజ్ అతడిని అడగగా.. రమేష్ మద్యం మత్తులో దుర్భాషలాడాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో చంపేస్తానని రమేష్‌ను సిరాజ్ బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత వచ్చి చూడగా.. రమేష్ అక్కడే నిద్రపోయి ఉండడంతో పక్కనే ఉన్న గ్రానైట్ రాయి తీసుకుని అతడి తలపై కొట్టాడు. రాయి దొరకకుండా కళాశాల గోడ వెనుక పడేసి అక్కడ నుంచి పరారయ్యాడు. హత్య జరిగిన ప్రాంతాన్ని గురువారం ఉదయం పోలీసులు పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి, 3 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నల్లగొండలోని రహమాన్‌బాగ్‌లో నిద్రిస్తున్న సిరాజ్‌ను వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని విచారణ చేయగా తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన రాయిని చూపించగా దానిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటనారాయణ, ఏఎస్ఐ వెంకట్‌యాదవ్, సిబ్బంది రబ్బాని, షకీల్, శ్రీకాంత్, శంకర్, జానకిరాములు, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపం వద్ద.. విద్యుదాఘాతంతో బాలుడు మృతి


మణికంఠ (ఫైల్)

హాలియా : గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద విషాదం చోటుచేసుకుంది. వినాయక మండపం వద్ద భక్తి పాటలు పెట్టేందుకు యాంపిల్ ఫ్లేయర్ వైరును విద్యుత్ బోర్డులో పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పదకొండేళ్ల బాలుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని కేవీ కాలనీకి చెందిన దండెం మహేందర్-మౌనిక దంపతుల కుమారుడు మణికంఠ(11) 5వ తరగతి చదువుతున్నాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేవీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తి పాటలు పెట్టేందుకు శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో దండెం మణికంఠ మండపం వద్దకు వెళ్లాడు. యాంపిల్ ఫ్లేయర్ వైర్‌ను విద్యుత్ బోర్డులో పెట్టేందుకు యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్న వయసులోనే నీకు నూరేళ్లు నిండాయా నాయన అంటూ కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. ఘటనా స్థలానికి సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్ చేరుకొని వినాయక మండపాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): మామను హత్య చేసిన కేసులో కోడలికి, ఆమె ప్రియుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ మహిళా కోర్టు జడ్జి కవిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన బొబ్బలి పద్మ అదే గ్రామానికి చెందిన ఆవుల వేణు మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం పద్మ భర్త లింగయ్యకు తెలియడంతో మందలించాడు. మరోసారి జరగనివ్వమని పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పుకున్నారు. 2017 ఆగస్టు 3న పద్మ మామ భిక్షమయ్య వ్యవసాయ పొలం నుంచి ఇంటి వచ్చే సమయానికి పద్మ తన ప్రియుడు వేణుతో కలిసి ఉంది. దీంతో భిక్షమయ్య ఇద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో పద్మ, వేణు ఇద్దరు కలిసి భిక్షమయ్యపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో భిక్షమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మ భర్త లింగయ్య నకిరేకల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ సుబ్బరామిరెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరిపి ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన జడ్జి కవిత ఇద్దరు నిందితులు బొబ్బలి పద్మ, ఆవుల వేణుకు జీవిత ఖైదు, రూ.4 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. కోర్టు కానిస్టేబల్ సుధాకర్, లైజన్ ఆఫీసర్లు నరేందర్, మల్లిఖార్జున్ లు కోర్టుకు సరైన సాక్ష్యాధారాలు సమర్పించడంలో సహకరించారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వరద బాధితులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం కట్టంగూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నకిరేకల్ నియోజకవర్గానికి మంజూరైన రూ.105 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా ఖర్చు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. గతంలో మంజూరైన పనులను మార్చకుండా అక్కడే ఖర్చు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లు వినియోగంలో లేకుండా పోవటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కట్టంగూర్‌లో పెద్దవాగుపై రెండు బ్రిడ్జిలు నిర్మించేందుకు రూ.4కోట్లు మంజూరు చేయించానని ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, పోగుల నర్సింహ, గడుసు కోటిరెడ్డి, చెవుగోని జనార్దన్, బెల్లి సుధాకర్, గుండగోని రాములు, మేడిరాములు, దాసరి సంజయ్, మునుగోటి ఉత్తరయ్య పాల్గొన్నారు.

నగదు చోరీ కేసులో ఏడుగురు అరెస్టు

- రూ.2.32లక్షల నగదు, కారు స్వాధీనం
- నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం వాసులు

నకిరేకల్: బ్యాంక్‌లో డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యక్తి నుంచి రూ.2.50లక్షల నగదు దొంగిలించిన ఏడుగురిని నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నకిరేకల్ మండలం నడిగూడెం గ్రామానికి చెందిన మాద నాగరాజు గోల్డ్ లోన్ చెల్లించేందుకు రూ.3 లక్షలు నగదును కవర్‌లో పెట్టుకుని ఈనెల 25న నకిరేకల్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్‌కు వచ్చాడు. ఒక చేతిలో డబ్బుల కవర్ పట్టుకుని, మరొక చేతితో బ్యాంక్ ఓచర్ రాస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని నలుగురు మహిళలు బ్యాంక్‌లోకి వచ్చి సదరు నాగరాజు దృష్టి మళ్లించి వెనకాల నుంచి అతని చేతిలోని కవర్‌ను బ్లేడ్‌తో కట్ చేశారు. అందులో ఉన్న రూ.2.50లక్షల నగదు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. అదే రోజు బాధితుడు నాగరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు నకిరేకల్ సీఐ వెంకటేష్, ఎస్ఐ లచ్చిరెడ్డి తన సిబ్బందితో నిందితుల కోసం గాలించారు. గురువారం రాత్రి నకిరేకల్ శివారులోని 65 నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఏడుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా.. వారిని ఆపి విచారించారు. ఒకరికి ఒకరు పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నకిరేకల్‌లోని బ్యాంక్‌లో నాగరాజు అనే వ్యక్తి నుంచి నగదు చోరీ చేసినట్లు వారు అంగీకరించారు. నకిరేకల్‌తో పాటు చౌటుప్పల్, చిట్యాల ఏరియాల్లో చోరీ చేయాలని పథకంతో కోదాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు, బ్లేడ్, రూ.2.32లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడేనికి చెందిన పురుపు రెడ్డి, పట్నాల పోలమ్మ, పోదుపురెడ్డి, యరసాని సంధ్య, మేపి పరుపురెడ్డితో మరో ఇద్దరు బాలురు ఉన్నారు. కేసును ఛేదించిన నకిరేకల్ సీఐ వెంకటేష్, ఎస్ఐలు లచ్చిరెడ్డి, కృష్ణాచారి, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, సురేష్, జనార్దన్, మధుకర్, లక్ష్మీలను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ వివరించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్ : ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన బచ్చు నారాయణ(95) ఈనెల 28న రాత్రి సమయంలో గ్రామ శివారులో గల సాగర్ ఎడమ కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. శుక్రవారం తడకమళ్ల గ్రామ శివారులో గల బ్రిడ్జి వద్ద మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. మృతుడి కుమారుడు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్తను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతం

- చికిత్స పొందుతున్న ముగ్గురు మున్సిపల్ కార్మికులు

నకిరేకల్: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెత్తను శుభ్రం చేస్తున్న ముగ్గురు మున్సిపల్ కార్మికులు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ సంఘటన నకిరేకల్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. నకిరేకల్‌లోని మినీ స్టేడియం పక్కన ఉన్న జెడ్పీ బాలికల పాఠశాలలో హెచ్‌ఎం ఉద్యోగ విరమణ సభ శనివారం జరగనుంది. ఈనేపథ్యంలో పాఠశాల పరిసరాలను స్థానిక మున్సిపాలిటీకి చెందిన ఆరుగురు కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఈక్రమంలో పాఠశాల భవనంపై చెత్త చేరి వర్షం నీరు నిలిచిపోవడంతో ఇద్దరు మహిళా కార్మికులు పైకి ఎక్కారు. పాఠశాల భవవం అంచునే 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ఆపైనే ఉన్న చెట్ల కొమ్మలను కార్మికులు పట్టుకుని శుభ్రం చేస్తుండగా.. కొమ్మలకు విద్యుత్ ఎర్త్ సరఫరా కావడంతో నల్లగొండ శోభ అక్కడే పడిపోయింది. ఆమెను కాపాడేందుకు మరో కార్మికురాలు వంటిపాక సబిత వెళ్లగా ఆమె కూడా షాక్‌కు గురైంది. వారిద్దరిని కాపాడేందుకు వెళ్లిన మరో కార్మికుడు వంటిపాక నాగరాజు కర్రతో కొడుతున్న క్రమంలో షాక్‌కు గురయ్యాడు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. శోభ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు నదిలో పడిన యువకుడు

- సహాయక చర్యలు కొనసాగుతుండగా అతడిని కాపాడేందుకు నదిలోకి దూకిన మరో యువకుడు


రామన్నపేట: ప్రమాదవశాత్తు ఓ యువకుడు మూసీ నదిలో పడిపోగా.. వరద ప్రవాహానికి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న చెట్టును పట్టుకుని ఉండడంతో అతడిని ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన కానుకుంట్ల మత్స్యగిరి అనే యువకుడు శుక్రవారం రాత్రి లక్ష్మాపురం శివారులోని వంతెనపై నుంచి ప్రమాదవశాత్తు మూసీ నదిలో పడిపోయాడు. ప్రవాహానికి కొట్టుకుపోతున్న అతను 300, 400 మీటర్ల దూరంలో చెట్టును పట్టుకొని ఉండడాన్ని గ్రామస్తులు గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు నాగరాజు, రాఘవేందర్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. నల్లగొండ నుంచి ఎస్డీఆర్ఎఫ్ బృందం వంతెన వద్దకు చేరింది. నలుగురు సభ్యులతో కూడిన ఎస్డీఆర్ఎఫ్ బృందం మత్స్యగిరి దగ్గరికి వెళ్తుండగా బృందంలోని ఓ వ్యక్తి అదుపుతప్పి నదిలో పడిపోయాడు. మిగిలిన సభ్యులు అతడిని రక్షించారు. మత్స్యగిరిని ఒడ్డుకు చేర్చేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన అంబటి పవన్ అనే యువకుడు తన స్నేహితుడిని రక్షిస్తానని నదిలోకి దూకాడు. అతడిని ఎస్డీఆర్ఎఫ్ బృందం ఒడ్డుకు చేర్చింది. చీకటి పడడం, నదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో రాత్రి 11 సమయంలో సహాయక చర్యలు నిలిపివేశారు.

హత్యకేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

మోత్కూర్ : భర్త హత్య కేసులో భార్యతో సహా మరో ఇద్దరి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా స్పెషల్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆత్మకూర్(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన సల్ల సైదులుకు సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం గురజాల చెందిన ధనలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ధనలక్ష్మి అదే గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. 2023 ఆగస్టు 12న ధనలక్ష్మి తన భర్త సైదులును తల్లిగారింటికి పిలిపించుకుని ప్రియుడు నవీన్‌తో కలిసి మోత్కూరు మండలం పాడిచేడు మూసీ నది ఒడ్డున ఉరి వేసి హత్య చేశారు. ఈ కేసులో ఎడ్ల నవీన్ ఏ1, తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన డ్రైవర్ తాటిపాముల స్వామి ఏ2, మృతుడి భార్య ధనలక్ష్మికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.40వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

బంగారం చోరీ కేసులో మరోవ్యక్తి అరెస్టు

- సూర్యాపేట జ్యుయలరీ షాపులో జరిగిన చోరీ కేసులో ఇప్పటివరకు నలుగురు అరెస్ట్
- ఏ5 నిందితుడి వద్ద 25తులాల బంగారం, రూ.4.80లక్షల నగదు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిసంతోషి జ్యుయలరీ షాపులో గత నెల 21న అర్ధరాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుడి నుంచి 25తులాల బంగారం, రూ.4,84,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక బృందం పశ్చిమ బెంగాల్‌కు వెళ్లి సాంకేతిక ఆధారాలు, నమ్మదగిన సమాచారంతో ఈ కేసులో నిందితుడిగా ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లాకు చెందిన ఏ5 జషిముద్దీన్‌ను ఈ నెల 26 మాల్దా జిల్లా, రత్వా పోలీస్ స్టేషన్ పరిధి, ఒకేరా చాంద్‌పరా మండలం అందారు గ్రామంలో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 25తులాల బంగారు ఆభరణాలు, రూ.4,84,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్ చాచల్ కోర్టులో న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టి 7 రోజుల పోలీసు కస్టడీకి అనుమతి తీసుకుని నిందితుల రాష్ట్రాల బదిలీ (ట్రాన్సిట్) నిబంధనల ప్రకారం సూర్యాపేటకు తీసుకువచ్చారు. నిందితుడిని జషిముద్దీన్‌ను విచారించగా నేపాల్‌కు చెందిన ఏ1 ప్రకాశ్ అనిల్ కుమార్, ఏ2 కడక్ సింగ్ అహుల్ వాలియ, ఏ3 పురన్ ప్రసాద్ జోషి, పశ్చిమబెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లాకు చెందిన ఏ4 మాలిక్ మొల్లతో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెక్కీ నిర్వహించి సాయి సంతోషి జ్యువెలరీ షాప్‌లో బంగారం, నగదు దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అనంతరం కిరాయికి తీసుకున్న ఇంటికి వెళ్లి దొంగతనం చేసిన సొత్తును 5 భాగాలుగా పంచుకొని ఈ దొంగతనంలో సహకరించిన ఏ7 యశోద, ఏ6 అమర్ బట్‌లకు ఖర్చుల కోసం కొంత బంగారం, డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి పారిపోయినట్లు విచారణలో పేర్కొన్నాడు. ఏ6 నిందితుడైన అమర్ బట్ వాటాకు వచ్చిన బంగారం ఏ1 ప్రకాష్ అనిల్ కుమార్ వద్ద ఉంచి ఆ బంగారాన్ని నేపాల్‌లో తీసుకునేటట్లుగా అనుకున్నారని విచారణలో నిందితుడు పోలీసులకు తెలిపాడు.

ఇప్పటివరకు నలుగురు దొంగలు అరెస్టు

బంగారం దొంగతనం కేసులో మొత్తం ఏడుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటి వరకు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మొదట అరెస్ట్ చేసిన ఏ7 నిందితురాలు యశోద నుంచి 14 తులాల బంగారం, ఈ నెల 11న వెస్ట్ బెంగాల్‌లో ఏ4 నిందితుడు మాలిక్ మొల్ల నుంచి సుమారు రూ.55 లక్షల విలువైన 554 (అరకిలో) గ్రాముల బంగారం, రూ.87 వేల నగదు, ఖమ్మంలో అరెస్ట్ చేసిన ఏ6 నిందితుడు అమర్ బట్ నుంచి రూ. 5 వేల నగదు, ఏ5 నిందితుడు జషిముద్దీన్ నుంచి రూ.25 లక్షల విలువైన 25 తులాల బంగారం, రూ.4,84,500 నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సీఐ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.